గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఆగదా?

కుళ్లిన కూరగాయలు.. అన్నంలో పురుగులు.. అపరిశుభ్ర వాతావరణం.. గురుకులాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి బయటపడుతున్నది. సరిగా ఉడకని, ముద్దలు కట్టిన అన్నం పెడుతున్నారంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్ చేపట్టిన గురుకుల బాటలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమస్యలు తెలుసుకునేందుకు గురుకులాలకు వచ్చే బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. పలుచోట్ల గురుకుల పాఠశాల గేట్లకు తాళాలు వేస్తూ లోనికి వెళ్లకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు.

ముద్ద అన్నం.. నీళ్ల కూరలు

ఇనుగుర్తి, డిసెంబర్ 4: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థినులకు ముద్ద అన్నం.. నీళ్ల చికెన్‌తో భోజనం పెడుతున్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ బుధవారం గురుకులాన్ని సందర్శించి, వంటశాలను పరిశీలించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో 'నమస్తే తెలంగాణ' మాట్లాడగా తమకు రోజూ ముద్దల అన్నం పెడుతున్నారని, నీళ్లకూరలు పెడుతున్నారని తెలిపారు. పాఠశాలలో, హాస్టల్ తమతోనే పనులు చేయిస్తున్నారని వాపోయారు. బోరువాటరే తాగుతున్నామని, టాయ్‌లెట్స్ సక్రమంగా లేవన్నారు. ఎమ్మెల్యే మాత్రం పాఠశాలలో అన్నీ బాగానే ఉన్నాయని చెప్పడం గమనార్హం.

- కొయ్యగుట్టలో పోలీసుల అడ్డగింత

బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 4 : 'గురుకుల బాట'కు ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలో గురుకుల బాట కమిటీ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన గురుకుల బాట ఉద్రిక్తతకు దారితీసింది. రాజారాం యాదవ్, బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు మండలంలోని కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు పాఠశాల గేటు ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. లోపలికి వెళ్లకుండా వారిని అరెస్టు చేసి బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించాలనే సత్సంకల్పంతో కేసీఆర్ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిం దని చెప్పారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సాం ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి సబ్బాని హరీశ్ ఆధ్వర్యంలో సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మైనార్టీ గురుకుల పాఠశాలకు వెళ్లగా ప్రిన్సిపాల్ రఫత్ అడ్డుకొని వాగ్వాదానికి దిగాడు.



పురుగుల అన్నం, కుళ్లిన కూరగాయలు

ఆత్మకూరు, డిసెంబర్ 4 : అన్నంలో పురుగులు.. కుళ్లిన కూరగాయలతో వంట చేయగా తినేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడిన ఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకున్నది. గురుకుల బాటలో భాగంగా బీఆర్ఎస్వీ నాయకులు బుధవారం ఆత్మకూరు మండల ం బాలకిష్టాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి శివప్రసాద్ యాదవ్, బీఆర్ఎస్వీ మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రియాజ్, జిల్లా కోఆర్డినేటర్ హేమంత్ తదితరులు విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తుండగా.. అన్నంలో పురుగులు బయటపడ్డాయి. వంటగదిని పరిశీలించగా శుచి, శుభ్రత లేకుండా దర్శనమిచ్చింది. కుళ్లిన కూరగాయలు, మురిగిపోయిన బీరకాయలు వెలుగుచూశాయి. విద్యార్థినుల సమస్యలపై అధికారులను నిలదీయగా తప్పించుకునే ప్రయత్నం చేశారు.

- 'గురుకుల బాట'లో ఉద్రిక్తత

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 4 : బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నేతలు చేపట్టిన గురుకులబాటలో ఉద్రిక్తత నెలకొన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల సందర్శనకు బుధవారం నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, వైస్ చైర్మన్ బాబురావు, మహిళా కౌన్సిలర్లు, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ విష్ణుసాగర్‌తోపాటు పలువురు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమయంలో అనుమతి లేదంటూ ఎస్సై గోవర్ధన్ నేతలను అడ్డుకున్నారు. బలవంతంగా పాఠశాల బయటకు తోసేసి గేటుకు తాళం వేశారు. అనంతరం 30 మంది కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

- ప్రభుత్వం పట్టించుకోదా?

చందంపేట (దేవరకొండ), డిసెంబర్ 4 : గురుకులాలు, వసతి గృహాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లా పీఏపల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌లో మంగళవారం ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై దేవరకొండ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బుధవారం ఆయన పరామర్శించారు. పీఏపల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినుల అస్వస్థతపై జిల్లా అధికారులు స్పందించారు. బుధవారం జిల్లా వైద్యాధికారి శ్రీనువాస్, ముగ్గురు డాక్టర్లు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారు.

అమెరికా మిస్ జూనియర్‌గా మనహన్సిక

బంజారాహిల్స్, డిసెంబర్ 4: అమెరికాలో నిర్వహించిన అందాల పోటీల్లో తెలంగాణకు చెందిన బాలిక సత్తా చాటింది. 'నేషనల్ అమెరికన్ మిస్ జూనియర్ టీన్' టైటిల్‌ను సాధించి రాష్ట్రానికి వన్నె తెచ్చింది. మంగళవారం రాత్రి అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన నేషనల్ మిస్ అమెరికన్ పోటీల్లో తెలంగాణలోని వనపర్తికి చెందిన హన్సిక నసనల్ (16) పాల్గొంది. అమెరికాలోని 50 రాష్ట్రాల నుంచి వచ్చిన 118 మంది బాలికలతో పోటీపడి మిస్ జూనియర్ టీన్ క్యాటగిరీలో విజేతగా నిలిచింది. అమెరికాలో స్థిరపడ్డ హన్సిక తండ్రి శేఖర్, భరతనాట్య కళాకారిణి అయిన తల్లి ప్రశాంతిని ప్రోత్సాహంతో హన్సిక పలు పోటీల్లో విజేతగా నిలిచింది.

చెక్ పోస్టులపై ఏసీబీ దాడులు

ఆదిలాబాద్, గద్వాల, నల్లగొండ జిల్లాల్లో సోదాలు

న్యూస్ నెట్‌వర్క్ , నమస్తే తెలంగాణ, డిసెంబర్ 4 : ఏసీబీ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి బుధవారం వరకు ఏకకాలంలో మూకుమ్ముడిగా దాడులు నిర్వహించారు. నిర్మల్ జిల్లా మార్కెట్ కమిటీ కార్యాలయం ఏవో శ్రీనివాస్ దడువాయి లైసెన్స్ కోసం రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బుధవార్‌పేట్‌కు చెందిన వెంకటేశ్ దడువాయి(వేమాన్) లైసెన్స్ కోసం మార్చిలో దరఖాస్తు చేసుకున్నాడు. లైసెన్సు కోసం ఏవో రూ.10వేలు డిమాండ్ చేయగా వెంకటేశ్ రూ.7 వేలు అధికారికి ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో శ్రీనివాస్‌ను పట్టుకున్నారు. శ్రీనివాస్‌ను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరజ్ చెక్‌పోస్టు కార్యాలయంలో రసీదులకు సంబంధంలేని రూ.62,500 నగదు సీజ్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం ఆర్టీఏ చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు దాడులు చేసినట్టు తెలిసింది. ఏఎంవీఐ రమేశ్, అమృతవర్షిని, కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, హోంగార్డ్ గోవిందును ఏసీబీ అధికారులు విచారణ చేసినట్టు సమాచారం. తనిఖీలో రూ.29 వేల నగదు గుర్తించామని ఏసీబీ సీఐ లింగస్వామి తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి ఆర్టీఏ చెక్‌పోస్టుపై ఏసీబీ దాడులు చేసి, రూ.86 ,600 నగదును సీజ్‌చేసినట్టు తెలిసింది.

ఏఐబీపీలోకి చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): సత్వర సాగునీటి ప్రాయోజిత కార్యక్రమం (ఏఐబీపీ)లో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టును చేర్చేందుకు కేంద్రం సుముఖత వ్యక్తంచేసింది. ఇటీవల ఇరిగేషన్ అధికారులు పంపిన ప్రతిపాదనలకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది. దీంతో ప్రాజెక్టుకు కేంద్రం రూ.233 కోట్ల నిధులను విడుదల చేయనుంది. ఏఐబీపీ-2 ఫేజ్‌లో రాష్ట్రంలో ఇప్పటికే 29 ప్రాజెక్టులను చేర్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం వాటికి అదనంగా మరో 3 ప్రాజెక్టులను ఆ ప్రోగ్రామ్‌లో చేర్చాలని నిర్ణయించింది. ఏఐబీపీ మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర జల శక్తిశాఖ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ అనుమతులు సాధించింది.

గిట్టుబాటు కల్పించాలని చెరకు రైతుల ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): చెరకు టన్నుకు రూ.4వేలు, బోనస్ రూ.వెయ్యి అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్ షుగర్‌కేన్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.వెయ్యి బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'చలో బస్‌భవన్'కు హైకోర్టు అనుమతి

- ప్రభుత్వ,యాజమాన్య కుట్రలను తిప్పికొట్టిన ఆర్టీసీ జేఏసీ
- ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, జేఏసీ నిర్వహించనున్న 'చలో బస్‌భవన్'ను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేసిన కుట్రను కార్మికులు ఛేదించారు. బస్‌భవన్ వద్ద నిరసనతో కూడిన మాస్ మీటింగ్‌కు అనుమతిస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్టు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి తెలిపారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చలో బస్‌భవన్‌కు వచ్చేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కార్మికులను ప్రభుత్వ, యాజమాన్యాలు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. అందులో భాగంగా 5న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏడాదిపాలన సంబురాల సభలకు ప్రతి డిపో నుంచి బలవంతంగా కార్మికులను తరలించేందుకు ఆదేశాలు ఇచ్చినట్టు జేఏసీ భావిస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కార్మికులను ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించారు. కార్మికుల్ని భయభ్రాంతులకు గురిచేసి సంబురాలకు తీసుకెళ్తే.. అక్కడకి వెళ్లిన తర్వాత తమ డిమాండ్లను గట్టిగా అరుస్తూ నినాదాలు చేయాలని కన్వీనర్ మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య సుద్దాల సురేశ్, బీ యాదగిరి కార్మికులకు సూచించారు.

- పత్తి కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

పత్తిని కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం నల్లగొండ జిల్లాలో రైతులు ఆందోళనకు దిగారు. పెద్ద అడిశర్లపల్లి మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల రహదారిపై తిరుమల మిల్లు ఎదుట బైఠాయించారు. కొనుగోలు చేసిన పత్తిలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు. -పెద్దఅడిశర్లపల్లి

- తాగునీటి కోసం రాస్తారోకో

తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌లో స్థానికులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు, స్పెషల్ ఆఫీసర్ వచ్చి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. - రుద్రూర్

కాకతీయ ద్వారా చివరి ఆయకట్టుకూ నీళ్లు

- జనవరి 1 నుంచి మార్చి 31 వరకు విడుదల చేస్తాం
- ఇరిగేషన్ కరీంనగర్ ఈఎన్సీ శంకర్

మాట్లాడుతున్న ఈఎన్సీ శంకర్

తిమ్మాపూర్, డిసెంబర్ 4 : యాసంగి సీజన్ పంటలకు లోయర్ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా సూర్యాపేట జిల్లా వరకు సాగు నీరందిస్తామని ఇరిగేషన్ కరీంనగర్ ఈఎన్సీ శంకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలోని సీఈ కార్యాలయంలో బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ఎండీలో 23.735 టీఎంసీలు, శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌లో 26.73 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మిషన్ భగీరథ, తాగునీటి అవసరాలకు పోను రెండు ప్రాజెక్టుల నుంచి 25 టీఎంసీలు, ఎస్సారెస్పీ నుంచి 5 టీఎంసీలు కలిపి మొత్తం 30 టీఎంసీలు అందిస్తామని వివరించారు. కాకతీయ కాలువ 146 కిలోమీటర్ ఎల్ఎండీ నుంచి, 284 కిలోమీటర్ మహబూబాబాద్ వరకు ఒక విడతగా 8 రోజులు, 284 కిలోమీటర్ నుంచి 349 కిలోమీటర్ సూర్యాపేట వరకు మరో విడతగా 7 రోజులు వదులుతామని చెప్పారు. కాలువ మొత్తంలో 71 డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉండగా.. స్టేజ్-1 కింద 5లక్షల ఎకరాలకు, స్టేజ్-2 కింద 4లక్షల ఎకరాలకు నీటిని విడుదల చేస్తామని వెల్లడించారు. నీటి విడుదల జనవరి ఒకటి నుంచి మార్చి 31 వరకు కొనసాగుతుందని చెప్పారు. కాకతీయ కెనాల్ ప్రధాన కాలువ నుంచి స్టేజ్-1 మహబూబాబాద్ వరకు 8రోజులు, అక్కడి నుంచి సూర్యాపేట వరకు 7 రోజులు వదులుతామని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లపై సర్కారు మెలిక

మొదటిపేజీ తరువాయి...

గంపెడాశతో నిరీక్షిస్తున్నారు. జాగా ఉంటే 5 లక్షలు ఇస్తామంటూ ఎన్నికల్లో ప్రకటించిన కాంగ్రెస్ అది ఆచరణసాధ్యం కాదని భావిస్తున్నట్టు సమాచారం. కేంద్రం ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆర్థికసాయం చేయాలని మెలిక పెట్టనున్నట్టు తెలుస్తున్నది.

ఆచరణకు నోచుకోని పనులు

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మొదటి విడతలో 4.5లక్షల ఇండ్లు నిర్మిస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గొప్పగా చెప్పింది. కానీ అర్హతలు ఏమిటనేది వెల్లడించలేదు. పట్టణ ప్రాంతాల్లో ఇల్లు కట్టుకోవాలంటే ఎల్ఆర్ఎస్‌కు, అనుమతులకే కనీసం లక్ష రూపాయల వరకు ఖర్చవుతున్నది. అనుమతుల నుంచి మినహాయింపు ఉంటుందా? తేలాలి.

అక్కడి వాళ్లా.. ఇక్కడి వాళ్లా..?

గ్రామీణ ప్రాంతాలకు చెందిన చాలామంది ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. కానీ వారిలో కొందరికి సొంత గ్రామాలు, పట్టణాల్లో ఇంటి స్థలం ఉంటే.. ఆధార్ కార్డులు, గ్యాస్ కనెక్షన్లు హైదరాబాద్‌లో ఉంటే.. ఇల్లు మంజూరు చేస్తారా? అనేవి తేలాల్సి ఉంది. యాప్ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తామంటున్న ప్రభుత్వం మరి కమిటీలను ఎందుకు ఎంపిక చేసినట్టో స్పష్టత ఇవ్వాల్సిన అవసరముందని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. కమిటీలతో అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుంది అని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కేంద్రం ఇస్తేనే ఇందిరమ్మ ఇండ్లు?

ప్రభుత్వానికి 82లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది 4.5లక్షల మందికి ఇండ్ల కోసం రూ.5లక్షల చొప్పున ఇవ్వాలంటే రూ.22,000 కోట్లు అవసరం. బడ్జెట్‌లో రూ.7,740 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో కాంగ్రెస్ సర్కారు మరో ఎత్తుగడ వేస్తున్నది. తామే ఇండ్లు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేంద్రం మంజూరు చేసిన వారికే ఇవ్వాలని చూస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కేంద్రం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదల కోసం గృహనిర్మాణ పథకాలు అమలు చేస్తున్నది.

భయ కంపం

మొదటిపేజీ తరువాయి...

మళ్లీ అదే తీవ్రతతోనే ప్రకంపనలు వచ్చాయని భూగర్భ శాస్త్రవేత్తలు వెల్లడించారు. హైదరాబాద్, ఏటూరునాగారం, ములుగు, భద్రాచలం తదితర ప్రాంతాలు 3వ జోన్‌లో ఉన్నాయని తెలిపారు. ఉత్తర భారతం 5వ జోన్‌లో ఉన్నదని, అక్కడ వచ్చే భూకంపాలు ప్రమాదకరమని పేర్కొన్నారు. హైదరాబాద్ 2వ జోన్‌లో ఉన్నదని, భయపడాల్సిందేమీ లేదని చెప్పారు.

పలు ప్రాంతాల్లో ప్రకంపనలు

ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలో భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. హైదరాబాద్ నగరంలోని మణికొండ, బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, అత్తాపూర్, నార్సింగి, రాజేంద్రనగర్, ఎర్రగడ్డ, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, ఉప్పల్, తార్నాక, బాచుపల్లి, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, బోరబండ, శేరిలింగంపల్లి ఏరియాల్లో భూకంపం ప్రభావం కనిపించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు, హన్మకొండతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, చింతకాని, చర్ల, ఇల్లెందు, నాగులవంచ ప్రాంతాల్లో భూమి కంపించింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, చెన్నారావుపేట మండల కేంద్రంలో భూమి కంపించింది.

ఆగస్టు 31న ములుగులో సుడిగాలి

అరేబియా సముద్రం, హిందూమహాసముద్రాల నుంచి వందల కిలోమీటర్ల వేగంతో ఎదురెదురుగా వచ్చిన గాలులు ఢీకొట్టిన ప్రాంతంలో టోర్నడో ఏర్పడుతుందని, అది ఈ ఏడాది ఆగస్టు 31న ములుగు జిల్లా మేడారంలో సంభవించిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ సుడిగాలి ప్రభావంతో మేడారం అరణ్యంలో సుమారు 60 వేల చెట్లు కూలిపోయాయి. ఇదే ప్రాంతం కేంద్రంగా ఇప్పుడు భూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఏపీలోని విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోని కొండలను.. నిర్మాణాలకు అవసరమైన కంకర కోసం అతిగా తోడేస్తుండటం పట్ల శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. మనిషి తన స్వార్థం కోసం ప్రకృతిలోని సహజ వనరులను అతిగా ధ్వంసం చేయడం వల్ల ఇలాంటి దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో.. భూ స్వభావానికి సంబంధించిన టెక్నికల్ అంశాలను విస్మరించకూడదని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు శాస్త్రవేత్తలు సూచించారు.

ఫాల్ట్ జోన్‌లో గోదావరి పరివాహకం ఉండటం వల్లే..

దేశంలో 59 శాతం వివిధ తీవ్రతలతో భూకంపాలకు గురవుతాయన్నారు. భూకంపాలు సంభవించే ప్రాంతాలను, వాటి తీవ్రత దృష్ట్యా జోన్2, జోన్-3, జోన్-4, జోన్-5గా నాలుగు జోన్లుగా విభజించారు. జోన్-5 అత్యంత భూకంప క్రియాశీల ప్రాంతం. అతి తక్కువ తీవ్రత కలిగిన ప్రాంతం జోన్-2. ప్రస్తుతం తెలంగాణ అతి తక్కు స్థాయి భూకంపాలు సంభవించే జోన్-2లో ఉంది. గోదావరి పరివాహక ప్రాంతంలో ఫాల్ట్ జోన్ ఉంది. ఇది భూకంపానికి కారణమవుతుంది. ఫాల్ట్ జోన్ అంటే భూమి అంతర్భాగంలో రెండు బ్లాకులు ఒకదానితో ఒకటి అకస్మాత్తుగా జారిపోయే ప్రదేశం. ఒక్కోసారి అంతర్భాగంలో సర్దుబాటుల కారణంగా విడుదలయ్యే అపారమైన శక్తి భూకంపాలుగా వస్తుంది. గోదావరి బేసిన్‌లో పలు చోట్ల పగుళ్లు, లోపాటు ఉన్నట్లు భూకంప శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇదే ఈ ప్రాంతంలో భూకంపాలకు కారణమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

గోదావరి పరివాహంలో భూకంపాలు: సైంటిస్ట్ బీవీ సుబ్బారావు

గోదావరి నది పరీవాహక ప్రాంతం కావడంతో భూమిలో మెత్తదనం ఏర్పడటం, సింగరేణి గనుల తవ్వకం వల్ల భూతరంగాలు వేగంగా వ్యాపించేందుకు సానుకూల పరిస్థితులు ఏర్పడటం వల్ల భూకంపం సంభవించి ఉండవచ్చని సీనియర్ శాస్త్రవేత్త బీవీ సుబ్బారావు అభిప్రాయపడ్డారు.

రామప్ప ఆలయాన్ని పరిశీలిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ అధికారులు

ఖమ్మం యూపీహెచ్ కాలనీలో భయంతో ఇండ్ల నుంచి బయటకు వచ్చిన స్థానికులు

ప్రకంపనలు కొనసాగవచ్చు: ఎన్జీఆర్ఐ అధికారి డాక్టర్ శేఖర్

సహజంగా నది పరీవాహక ప్రాంతాల్లో భూకంపం వచ్చినప్పుడు సుమారు 300 కిలోమీటర్ల పరిధిలో దీని ప్రభావం ఉంటుందని ఎన్జీఆర్ఐ అధికారి డాక్టర్ శేఖర్ చెప్పారు. అందువల్లనే హైదరాబాద్‌లోని పలు చోట్ల భూమి కంపించిందని అన్నారు. ఇది గోదావరి ములుగు ప్రాంతంలో మొదలై స్వల్పంగా కృష్ణ నది వరకు పాకిందని చెప్పారు. తరువాత కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పగుళ్లు ఉన్న పాత భవనాలలో ఉండకపోవడం మంచిదని సూచించారు.

కొత్తగూడెం జిల్లా సంజయ్‌నగర్‌లో ఓ ఇంటి గోడకు ఏర్పడిన పగుళ్లు

రాళ్ల కదలికల వల్లే ములుగు భూకంపం

- ఏటా 5 సెంటిమీటర్ల మేర కదులుతున్న ఇండియన్ ప్లేట్
- కాకతీయ వర్సిటీ, ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తల అభిప్రాయం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): గోదావరి నది పరీవాహక బేసిన్‌లో భూమిలోని భ్రంశాల్లో (పగుళ్లు) ఏమాత్రం స్థానచలనం జరిగినా భూకంప తరంగాలు ఉద్భవిస్తాయని, ఆ ఒత్తిడి రాళ్లలో కదలికలను ప్రేరేపించడంతో భూకంపాలు సంభవిస్తాయని కాకతీయ యూనివర్సిటీ జియాలజిస్ట్ మల్లికార్జున రెడ్డి అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లాలో బుధవారం ఉదయం ఏర్పడిన భూకంపం భూపొరల్లోని రాళ్ల కదలికల వల్లేనని తెలిపారు. 5.3 తీవ్రతను బట్టి ములుగు భూకంపాన్ని టెక్టోనిక్ ఎర్త్ క్వేక్‌గా పరిగణించవచ్చని నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) రిటైర్డ్ శాస్త్రవేత్త నగేశ్ తెలిపారు. భూమి అంతర్భాగంలోని మాగ్మా నుంచి వచ్చే బ్రహ్మాండమైన ఒత్తిడితో భూఫలకల్లో కదలికలు ఏర్పడుతాయని, ఈ ఫోర్స్ వల్ల ఇండియన్ ప్లేట్ ఉత్తరదిశగా ఏటా 5 సెంటిమీటర్ల మేర కదులుతున్నట్టు గుర్తు చేశారు. దీని కారణంగా భూమి పొరల్లో ఫాల్ట్స్ (పగుళ్లు) ఏర్పడి భూకంపాలు వస్తున్నట్టు వెల్లడించారు.

మాజీ సర్పంచులంటే భయమెందుకు?

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధిస్తున్నారని సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య గౌడ్ మండిపడ్డారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సర్పంచులంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ప్రజాపాలనలో ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చే స్వేచ్ఛ కూడా లేదా? అని నిలదీశారు. అణచివేతలు, అక్రమ అరెస్టుల ద్వారా మాజీ సర్పంచుల ఉద్యమాన్ని రేవంత్ సర్కారు ఆపలేదని స్పష్టం చేశారు.

ఐఐటీల్లో కొలువుల జోష్

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): దేశంలో అత్యున్నత విద్యకు కేరాఫ్ అడ్రస్ అయిన ఐఐటీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అదరగొట్టాయి. ఈ సారి ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ